ఆఫీసులో అడుగుపెట్టానో లేదో మొదలు...

దిక్కుమాలిన టెలిఫోను. ఆఫీసు తీసింది మొదలు మూసేవరకూ అలా మోగుతూనే ఉంటుంది.

"హలో!"

"సార్! ఎస్.పి. గారేనా?"

"ఆ"

"సార్! నేను పార్టీ ఆఫీసు నుంచి మాట్లాడు



గీతాసుబ్బారావు

తున్నాను. మంత్రిగారు రేపు ఉదయం విమానంలో వస్తున్నారు. పోలీసు బందోబస్తు బాగా చేయమని చెప్పారు..."

"సరే"

"సార్! ఎవరో నల్లజెండాలు చూపిస్తాం అని రాశారట. అందుకని విమానాశ్రయంలోకి వెళ్ళే వారి చేతుల్లో కర్రలూ, జేబుల్లో నల్ల జెండాలు లేకుండా చెక్ చేయమని గట్టిగా చెప్పారు.

"అలాగే"

"సార్! ఇంకో ముఖ్యమైన సంగతి. మంత్రి గారికి దండలు వెయ్యడానికి చాలామంది వస్తారట. దయచేసి మీరు వాళ్ళందరినీ విమానం దగ్గరకు రానిచ్చేందుకు అనుమతి వచ్చేలా చూడమన్నారు.

"ఆ"

"సార్! మంత్రిగారి కారుకి ముందు మూడు పోలీసు మోటారు సైకిళ్ళు... వెనకాల రెండు పోలీసు వ్యానులూ వుండాలని చెప్పారు."

"సరేగానీ... నేను ఎస్.పి.ని కాదు! రాంగ్ నంబర్!..." అంటూ ధామ్మని ఫోను పెట్టేసా!

"హలో! హలో!"

"యస్!"

"రాజా డియర్! నేను వసంతని!"

"......"

"ఏమిటి డియర్! నీకు మరీ ముక్కుమీద కోపం అయితే ఎలా? నిన్న సినిమాకి రానన్నా ననే కదా నీకింత కోపం?

"ఊ"

నన్ను అర్థం చేసుకో... నిన్న నాకు పెళ్లి చూపులు ఏర్పాటు చేశారు. పెళ్ళిచూపులకి ఇంట్లో ఉండకపోతే ఇంట్లో వాళ్ళకి కోపం రాదా? పైగా నా మీద అనుమానం కూడా వస్తుంది. అవునా? అందుకే పెళ్ళి చూపులకు ఉండి, నాకు నచ్చలేదని చెప్పేశాను. ఆ పెళ్లి కొడుకు మానాన్నకి కూడా నచ్చలేదు. ఆ పెళ్ళికొడుక్కి వాళ్ళ అమ్మ పోలికలు వచ్చాయట... వింటున్నావా?"...

"ఊ"

"అబ్బ... ఏమిటబ్బా... అన్నింటికీ ఉఊలు?... ఇదిగో - ఇవాళ సాయంత్రం రెడీగా ఉండు. తప్పకుండా సినిమాకి వెళ్దాం. సరేనా?... ఇంకా కోపం పోలేదా? ఓ ముద్దు ఇవ్వనా?..."

"వద్దు! వద్దు! నేను రాజూ డియర్‌ని కాదు... రాంగ్ నంబర్! గభాలున ఫోను పెట్టేసి... అలా కుర్చీలో వాలిపోయాను. మా ఆవిడ ఒక్కనాడయినా ఇలా మాట్లాడదేం? అనుకుంటూ... చిన్న కునుకు తీశాను...


"హలో!"

"హలో! ఎవరూ?..."

"నేనేనండీ!... మన మేడమీద వాళ్ళ ఫోను లోంచి మాట్లాడుతున్నా! వినబడుతోందా?"

'ఆ'

'చూడండీ... మీకు ఇందాక రాసి ఇచ్చిన పచారీ సామాన్ల లిస్టులో కందిపప్పు రాయడం మర్చిపోయాను. నాలుగు కిలోల కందిపప్పు రాసుకోండి. ఆ చేత్తోనే - అరతులం పాల ఇంగువ, అర్ధపావు ఆవాలూ రాసుకోండి. చూడండి... హార్లిక్సు సీసాలు దొరికితే - మరో రెండు ఎక్కువ తీసుకురండి... డాక్టర్‌గారు నన్ను కూడా హార్లిక్సే తాగమన్నారు. పైగా ఇవాళ పేపర్లో చూసారా?... హార్లిక్సు ముసలి వాళ్ళకీ చాలా మంచిదని రాశాడు... పెద్ద బొమ్మవేసి! మా నాన్నకి కూడా హార్లిక్సు ఇస్తే మంచిదనుకొంటాను!




'అమ్మా!... ఇది...'

'అమ్మకెందుకండీ" అమ్మకి హార్లిక్సు సయించదు! తర్వాత – అబ్బబ్బ... మధ్యలో గొణుగుతారేం?... నా మాట పూర్తిగా చెప్పిన తర్వాత మీరు మట్లాడండి!... నేను అసలే మతిమరపు దానినా? మీరు మధ్యలో మాట్లాడితే అన్నీ మరిచిపోతాను?... చూడండీ... ఇవాళ మీరు కాస్త త్వరగా రండి. పిల్లలకి వాళ్ళ స్కూల్లో నాటకాలు ఉన్నాయిట... మనం...'

'అమ్మా! తల్లీ! నేను మీ ఆయన్ని కాదు! రాంగ్ నంబర్...

"హల్లో!"

"హల్లో!..."

"ఏమయ్యా... నీకేమయినా బుద్ధివుందా? అన్నం తింటున్నావా? గడ్డి తింటున్నావా? అడ్డం ఉండి రెండువేల రూపాయలు ఇప్పించి, ఎన్నాళ్ళు అయింది?... ఎప్పుడు తీరుస్తానని చెప్పావు?

"అయ్యా... ఇది..."

"ఛస్! మాట్లాడకు! మాటమీద నిలబడలేనివాడివి నువ్వేం మనిషివి? ఆరోజున... అర్ధరాత్రి వచ్చి కడుపూ, కాళ్లూ పట్టుకుంటే... అయ్యోకదా అని జాలిపడి..."

"చూడండీ..."

"నువ్వు నోరెత్తక! ఫోనులో కాబట్టి బతికిపోయావు! లేకపోతేనా?... ఛీ ఛీ... మనిషికో మాట... గొడ్డుకో దెబ్బ అన్నారు. ఇలా ఎందర్ని ముంచుతావ్? మాట్లాడవేం? దౌర్భాగ్యుడా! దగుల్బాజీ! మాట్లాడవేం? నోరు పడిపోయిందా?... నీ పెళ్ళాం ముండమొయ్య...

షటప్! నోరుమూసుకోరా...రాంగ్ నంబర్ రంగనాధం!... ఫోను దభీమని పడేసి –

'వెధవరోజు! ఇంట్లోనూ తిట్లే!! ఆఫీసులోనూ తిట్లే!! కనీసం ఫోన్ అయినా మంచిది రాకూడదూ? అనవసరంగా తిట్టించుకొన్నాను. రాంగ్‌నంబర్ అని ముందే చెబితేపోయేది!... అనుకుంటూ ఫైళ్ళల్లో మునిగిపోయాను...